సాక్షి జగిత్యాల

గురువారం । 3 । జూలై । 2025



ధర్మగుండంలోని నీరు తొలగింపు

వేములవాడ: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ధర్మగుండంలోని నీరు మురికిగా మారడంతో నీటిని బుధవారం తొలగిస్తున్నారు. గోదావరి జలాలతో నింపనున్నారు.



కాసం ఫ్యాషన్స్ ప్రారంభం

జగిత్యాల పట్టణంలో కాసం ఫ్యాషన్స్ 18వ స్టోర్‌ను సినీ నటి, యాంకర్ అనసూయ ప్రారంభించారు.అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. -8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని చాలా చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు కొనసాగుతాయి.

ఖాళీ ప్లాట్లు.. అనేక పాట్లు

- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్



ఇది జిల్లాకేంద్రంలోని బైపాస్‌రోడ్‌లోని గోవిందుపల్లికి వెళ్లే రహదారి. ఖాళీ స్థలం మొత్తం చెత్తతో నిండిపోయింది. బల్దియా ట్రాక్టర్లు, ఆటోలు రాక డ్రైనేజీలు తీయడం లేదు. చెత్త తీసుకెళ్లకపోవడంతో ఖాళీ స్థలంలోనే పడేస్తున్నారు. పందులు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రిపూట ఉండలేకపోతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- ఈ చిత్రం మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని సిద్ధివినాయకనగర్‌లో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ ప్లాట్లు. వీటిల్లో ఎక్కడికక్కడ దట్టంగా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. పాముల బెడద ఎక్కువైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు ఖాళీ ప్లాట్లను శుభ్రం చేసే విషయంలో ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు.



- ఈ చిత్రం మెట్‌పల్లి బల్దియా పరిధిలోని హన్మాన్‌నగర్‌లోనిది. ఈ కాలనీ నూతన గృహాల నిర్మాణంతో విస్తరిస్తోంది. ఇందులోనూ అక్కడక్కడ ఉన్న ఖాళీ ప్లాట్లు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. కొన్ని ప్లాట్లల్లో మొక్కలతో పాటు మురుగునీరు వచ్చి చేరింది. ఈ సమస్యతో పరిసరాలు కంపు కొడుతుండడమే కాకుండా దోమల బెడద ఎక్కువైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



- ఇది బైపాస్ ప్రధాన రోడ్. డ్రైనేజీని ఆనుకునే చెత్త వేస్తున్నారు. విరిగిపోయిన కూలర్లు, ఫ్యాన్లు, చెడిపోయిన బెడ్స్, చినిగిన బట్టలు ఇలా అనేక వస్తువులు అక్కడే పడేస్తున్నారు. అటు వైపు వెళ్తేనే దుర్గంధం వెదజల్లుతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి అక్కడ చెత్త వేయకుండా చూడటంతోపాటు, డంపర్‌బిన్‌ను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



- ఇది నర్సింగ్ కళాశాల సమీపంలోని ఖాళీ స్థలం. ఇందులో మట్టి, చెత్తాచెదారం పడేస్తున్నారు. దుర్వాసన వస్తోందని కళాశాల విద్యార్థులు పేర్కొంటున్నారు. ఖాళీ స్థలం కావడంతో ఇష్టానుసారంగా ప్లాస్టిక్ వ్యర్థాలు పడేస్తున్నారు.



- ఇది కొత్త బస్టాండ్ సమీపంలోని వాటర్ ట్యాంక్ సంది. ఇక్కడ కమిషనర్ క్వార్టర్ కూడా ఉంటుంది. ఈ సమీపంలోనే అత్యధిక చెత్త పడేస్తున్నారు. కాలనీ మొత్తం దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జగిత్యాల/మెట్‌పల్లి: మెట్‌పల్లి మున్సిపాలిటీలో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు పెద్ద సమస్యగా మారాయి. సంబంధిత యజమానులు వాటిని శుభ్రంగా ఉంచడంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. దీనివల్ల వాటిలో పిచ్చి మొక్కలు దట్టంగా పెరగడమే కాకుండా చాలాచోట్ల వరద నీటి నిల్వతో మురికి గుంటలుగా తయారయ్యాయి. మరోవైపు మున్సిపల్ అధికారులు కూడా వీటి విషయంలో పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఫలితంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సమస్య ఉన్న కాలనీలు ఇవే..

- బల్దియాలోని హన్మాన్‌నగర్, బీడీ కాలనీ, సాయిరాంకాలనీ, టీచర్స్ కాలనీ, సిద్ధి వినాయ నగర్, బాలకృష్ణనగర్, అర్బన్ హౌజింగ్ కాలనీల్లో వందల సంఖ్యలో ఖాళీ ప్లాట్లు ఉన్నాయి. ఇవి ఎన్నో సమస్యలకు దారి తీస్తున్నాయి.
- ప్రధానంగా వాటిల్లో పిచ్చి మొక్కలు దట్టంగా పెరిగి పాములకు ఆవాసంగా మారుతున్నాయి. అవి ఇళ్ల పరిసరాల్లో సంచరిస్తుండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.
- అలాగే కొన్ని చోట్ల డ్రైనేజీలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు వాటిల్లోకి వచ్చి చేరుతోంది. దీంతోపాటు వరద నీరు కూడా చేరి నిల్వ ఉండడంతో అవి మురికి కుంటలుగా తయారవుతున్నాయి.
- ఇలాంటి వాటితో దుర్వాసనను వెదజల్లడంతో పాటు దోమల బెడద ఎక్కువై ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

చోద్యం చూస్తున్న మున్సిపల్ అధికారులు..

- ఖాళీ ప్లాట్లతో ప్రజలు ఇబ్బంది పడుతున్నప్పటికీ అవి మున్సిపల్ అధికారులకు పట్టడం లేదు.
- వాస్తవానికి నిబంధనల ప్రకారం..ఖాళీ ప్లాట్ల యజమానులు వాటిని శుభ్రంగా ఉంచుకోవాల్సి ఉంటుంది. పిచ్చి మొక్కలు పెరగకుండా.. చెత్తాచెదారం పేరుకుపోకుండా.. మురుగు నీరు నిలిచి ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలి.
- ఈ విషయంలో నిర్లక్ష్యం చూపే వారికి మున్సిపల్ అధికారులు నోటీసులు ఇవ్వాలి. దీనికి స్పందించకుంటే జరిమానా విధించే అవకాశముంటుంది.
- కానీ అధికారులు అలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.
- ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముంది. గతేడాది పెద్ద సంఖ్యలో ప్రజలు జ్వరాల బారిన పడ్డారు.
- కొన్ని రోజులుగా వార్డుల్లో పర్యటిస్తూ పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు.. అపరిశుభ్రతకు కారణమవుతున్న ఖాళీ ప్లాట్లను పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

జిల్లాకేంద్రంలో..

- జగిత్యాల.. గ్రేడ్–1 మున్సిపాలిటీ.. 48వార్డులు.. లక్షకు పైగా జనాభా ఉన్నా పారిశుధ్యం మాత్రం అస్తవ్యస్తంగా మారింది. ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాల్సిన ఆటోలు, ట్రాక్టర్లు వెళ్లకపోవడంతో చెత్తను ఖాళీ స్థలాల్లోనే పడేస్తున్నారు. మున్సిపాలిటిలో నాలుగు జోన్లు ఉన్నాయి. వార్డుకో ఆటో, జోన్‌కు మూడు ట్రాక్టర్లు నడుస్తుంటాయి. 48 వార్డులకు అవి సరిపోవడం లేనట్లు తెలుస్తోంది.

కన్పించని డంపర్‌బిన్స్

- ప్రధానమైన చోట్ల డంపర్‌బిన్స్ ఏర్పాటు చేస్తే చెత్త సమస్య ఉండదు. గతంలో ప్రతిచోట డంపర్‌బిన్స్ పెట్టారు. ప్రస్తుతం వాటన్నిటినీ ఎత్తివేశారు. దీంతో ఖాళీ స్థలాల్లోనే చెత్త పడేస్తున్నారు.

యుద్ధప్రతిపాదికన పారిశుధ్యం



వంద రోజుల ప్రణాళికలో భాగంగా యుద్ధప్రతిపాదికన పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతున్నాం. ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా చర్యలు తీసుకోవడంతోపాటు ప్రతి ఇంటింటికీ ఆటో పంపించేలా చూస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిరోజు శానిటేషన్ చేపడుతున్నాం.

– స్పందన, మున్సిపల్ కమిషనర్

న్యూస్‌రీల్

పథకాలను ప్రజల వద్దకు చేర్చాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ప్రజలకు చేర్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. బుధవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు. పనుల్లో అలసత్వం వద్దని ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ లత, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ కరుణాకర్

జగిత్యాలక్రైం: సైబర్ నేరాలు, భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల నుంచి సైబర్ జాగృక్త దివాస్ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, యువతకు సైబర్ భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సైబర్ నేరాలను నివారించడమే లక్ష్యంగా విద్యార్థులు, యువతకు, ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. పిల్లలు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాం వాడకుండా తల్లిదండ్రుల జాగ్రత్తలు పాటించాలన్నారు.

టీబీ ముక్త్ భారత్ దిశగా కృషి చేయాలి



ఆన్‌లైన్ వివరాలు పరిశీలిస్తున్న ఎన్.శ్రీనివాస్

మల్యాల: టీబీ ముక్త్ భారత్ దిశగా ప్రతీ ఒక్కరు కృషి చేయాలని జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎన్.శ్రీనివాస్ అన్నారు. మల్యాల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఉప వైద్య,ఆరోగ్య శాఖ అధికారి ఎన్.శ్రీనివాస్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నమోదైన రోగుల ఆన్‌లైన్ వివరాల నమోదును పరిశీలించారు. ఆన్‌లైన్ నమోదు త్వరగా పూర్తి చేసి, ఆరోగ్య సిబ్బంది ఇంటింటా తిరుగుతూ, టీబీ వ్యాధిగ్రస్తులను సకాలంలో గుర్తించాలన్నారు. దీర్ఘకాలికంగా పొడి దగ్గు, జ్వరం, హఠాత్తుగా బరువు తగ్గినట్లయితే టీబీ పరీక్ష చేయించుకోవాలని, కార్యక్రమంలో వైద్యులు మౌనిక, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



శాస్త్రవేత్త లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాయికల్: విద్యార్థులు చదువుతున్న సమయంలో శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని భూ భౌతిక శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం రాయికల్ మండలం ఇటిక్యాల ఉన్నత పాఠశాలను సందర్శించి మాట్లాడారు. చిన్నతనం నుంచే శాస్త్ర విజ్ఞానాన్ని అలవర్చుకుంటే ప్రతి అంశంపై ఆలోచించే శక్తి పెరుగుతుందన్నారు. సైన్స్ టీచర్లు చెప్పే పాఠశాలను బట్టి పట్టడం కంటే అర్థం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సదాశివ్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వారాహిమాతకు లక్ష పుష్పార్చన



కోరుట్ల: పట్టణంలోని త్రిశక్తి మాతా దేవాలయంలో వారాహినవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అమ్మవారికి బుధవారం లక్ష పుష్పార్చన చేశారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షుడు కట్ట నారాయణ, అధ్యక్షుడు గణేశ్, ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

‘సిగాచి’ మృతుల కుటుంబాలకు రూ.కోటి చెల్లించాలి

జగిత్యాలటౌన్: హైదరాబాద్ శివారు పాశమైలారం సిగాచి రసాయన పరిశ్రమలో మృతిచెందిన బాధిత కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి జీవన్‌రెడ్డి కోరారు. బుధవారం లేబర్ కమిషనర్‌కు లేఖ రాశారు. సిగాజి రసాయన పరిశ్రమలో పేలుడు ఘటన భోపాల్ ఘటనను తలపించిందన్నారు. 46మందికి పైగా మృతి చెందడంతోపాటు పదుల సంఖ్యలో తీవ్ర గాయాలపాలయ్యారని పేర్కొన్నారు. ఘటనపై ప్రత్యేక బృందంతో విచారణ చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కంపెనీ యాజమాన్యంపై హత్యానేరం కింద క్రిమినల్ చర్యలు చేపట్టాలని కోరారు.

తెలంగాణ హక్కులపై కేంద్రాన్ని నిలదీస్తాం

వెల్గటూర్: తెలంగాణ రావాల్సిన నిధులు, హక్కులపై కేంద్రంపై పోరాటం చేస్తామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. మండలకేంద్రంలో పలువురు బాధితులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, ఇప్పుడు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కమీషన్ల కోసం బనకచర్ల ప్రాజెక్టు నిర్మించి తెలంగాణకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకోబోమని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని అడ్డుకుంటామని తెలిపారు. సమస్య పరిష్కరించాల్సిన బీజేపీ చోద్యం చూస్తూ కూర్చోవడం సరికాదని, దీనిపై పార్లమెంట్‌లో నిలదీస్తామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గోపిక, నాయకులు తిరుపతి, ఉదయ్, శ్రీకాంత్‌రావు, సందీప్ రెడ్డి, వెంకటేశ్ ఉన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలానికి చెందిన 99మందికి రూ.28.14 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్, 86మందికి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కాంగ్రెస్ రైతుపక్షపాతి ప్రభుత్వమన్నారు. సన్నబియ్యం, కరెంట్, ఇందిరమ్మ ఇళ్లు, రుణమాఫీ, మహిళసంఘాలకు ఆర్థిక చేయూత వంటి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, నాయకులు రవీందర్‌రెడ్డి,పాలెపురాజు,ముకుందం, జాన్, మల్లారెడ్డి, బోనగిరి నారాయణ, నరేశ్ పాల్గొన్నారు.

డేకేర్ ఏర్పాటు చేయండి

జగిత్యాల: సీనియర్ సిటిజన్స్ కోసం డేకేర్ ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్స్ ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన ఆయన మంత్రి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లి కేంద్రం ఏర్పాటు చేసేలా చూస్తానన్నారు. హరి అశోక్‌కుమార్, విశ్వనాథం, హన్మంతరెడ్డి పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి

జగిత్యాల పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. పలు వార్డుల్లో రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.140 కోట్లతో పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ స్పందన, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, లక్ష్మణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేకాటపై సీసీఎస్ పోలీసుల నిఘా

- జిల్లాలో జోరుగా మూడుముక్కలాట
- చేతులు మారుతున్న కోట్ల రూపాయలు



ప్లే కార్డ్స్

ఏడాది	కేసులు	నిందితులు	పట్టుకున్న సొమ్ము(రూ.లలో)
2022	109	536	16,91,045
2023	78	473	18,66,696
2024	89	602	19,40,681
2025	71	447	16,68,520

జగిత్యాలక్రైం: జిల్లాలో మూడుముక్కలాట జోరుగా సాగుతోంది. పోలీసులు నిఘా పటిష్టం చేసి.. రోజుకోచోట పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి.. వారి నుంచి నగదు సీజ్ చేస్తున్నారు. నిందితులపై కేసులు నమోదు చేస్తున్నారు. పేకాటతో వారి కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయి. నిత్యం జూదం కొనసాగుతుండటంతో అనేక కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయి ఇబ్బంది పడుతున్నాయి. కొంతమంది ఆస్తులు, బంగారం తాకట్టు పెట్టి పేకాడుతూ తీవ్రంగా నష్టపోతున్నారు.

మామిడితోటలు, అడవుల్లో అడ్డా

పేకాట రాయుళ్లకు మామిడితోటలు, అడవులు అడ్డాలుగా మారాయి. కొందరు నిర్వాహకులు కొంత మంది పేకాటరాయుళ్లను మచ్చిక చేసుకుని వారికి విందు, వసతులు ఏర్పాటు చేసి అక్కడికే పిలిపిస్తూ పెద్ద ఎత్తున పేకాట నిర్వహిస్తున్నారు. స్థావరాల వద్ద ఉన్న రహదారులపై రహస్యంగా కాపలా ఏర్పాటు చేసుకుని పోలీసులు వస్తే సమాచారం రాగానే అక్కడి నుంచి పారిపోతున్నారు. కొంతమంది మహారాష్ట్రలోని అప్పారావుపేట, బోరి, బిరేళీ, గోవా వంటి ప్రాంతాలకు వెళ్లి పెద్ద ఎత్తున పేకాట ఆడుతున్నారు.

ఇతర జిల్లాల నుంచి వస్తున్న జూదరులు

జిల్లాకేంద్రంతో పాటు పలు మండలాలు, గ్రామాల్లోని అటవీ ప్రాంతాల్లో.. మామిడి తోటల్లో, ఫామ్ హౌస్‌లను వేదిక చేసుకుని పోలీసుల కళ్లు గప్పి పెద్ద ఎత్తున జూదం ఆడుతున్నారు. పోలీసులు జూదంపై కఠిన చర్యలు తీసుకుంటున్నా వారి ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు.

నిఘా పెంచిన సీసీఎస్ పోలీసులు

జిల్లావ్యాప్తంగా సీసీఎస్ పోలీసులతో పాటు, స్థానిక పోలీసులు పేకాటపై ప్రత్యేక దృష్టి సారించారు. పట్టుబడిన, నిర్వాహకుల వివరాలు సేకరిస్తూ సాంకేతికతతో సీసీఎస్ పోలీసులు వారిపై దాడులు చేస్తూ పేకాట రాయుళ్లకు అడ్డుకట్ట వేస్తున్నారు.

పారిపోతున్న జూదరులు

రహస్య ప్రాంతాలు, అటవీ ప్రాంతాల్లో, మామిడి తోటల్లో పేకాట ఆడుతున్న సమయంలో పోలీసులు దాడులు చేయగా, చాలామంది జూదరులు పోలీసుల కళ్లుగప్పి పారిపోతున్నారు. పోలీసులు దొరికిన వారి నుంచి కూపీ లాగడంతో పాటు అక్కడున్న వాహనాలను స్వాధీనం చేసుకుని అసలు నిందితులను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు.

ప్రత్యేక నిఘా పెట్టాం



పేకాటను అరికట్టేందుకు సీసీఎస్ పోలీసులు, ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇప్పటికే చాలామందిని అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశాం.పేకాటతో చాలామంది కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. ఆర్థికంగా అప్పుల పాలై కుటుంబాల్లో విభేదాలు తలెత్తున్నాయి. వీటిని అరికట్టేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోంది.

– అశోక్‌కుమార్, ఎస్పీ

అందని ‘ఉపాధి’ కూలి

- రెండు నెలలుగా నిలిచిన బిల్లులు
- జిల్లాలో రూ.1,25,26,813 బకాయిలు
- మొత్తం జాబ్ కార్డులు 1,67,461
- యాక్టివ్ జాబ్‌కార్డులు 1,00,723
- కూలీలు 1,38,823



పెగడపల్లి: చేసిన పనికి కూలి అందక ఉపాధికూలీలు ఎదురుచూస్తున్నారు. పనులు చేసి రెండు నెలలు దాటినా ఖాతాల్లో నగదు జమ కావడంలేదని వాపోతున్నారు. అధికారులు స్పందించి డబ్బులు జమ చేయాలని కోరుతున్నారు. పేద కూలీలకు రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. ఎండ, వాన లెక్కచేయకుండా ఉపాధిహామీ పథకం పనికి వెళుతున్నారు. వీరికి అందించాల్సిన వేతనాలు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. కుటుంబ పోషణ కష్టంగా మారుతోందని కూలీలు వాపోతున్నారు. ఉపాధి చట్టం ప్రకారం 14 రోజుల్లో చేసిన పనులకు కూలీ చెల్లించాల్సి ఉంటుంది. నెలల తరబడి కూలీ చెల్లించకపోవడంతో తాము ఆర్థికంగా అవస్థలు పాలవుతు న్నామని అంటున్నారు. నిత్యం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందంటున్నారు. జిల్లాలోని 380 గ్రామ పంచాయతీల పరిధిలో పనులను గుర్తిస్తూ ఉపాధిహామీ ద్వారా కూలీలకు పనులు కల్పిస్తూ ఆర్థిక భరోసానిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం కూలీలు 1,38,823 మంది కూలీలు నమోదై ఉన్నారు. మొత్తం 1,67,461 జాబ్ కార్డులుండగా 1,00,723 యాక్టివ్ జాబ్ కార్డులున్నాయి. రెండు నెలలకు సంబంధించి రూ.1,25,26,813 పెండింగ్‌లో ఉన్నాయి. తమకు రావాల్సిన వేతనాలు చెల్లించి తమను ఆదుకోవాలని ఉపాధిహామి కూలీలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వస్తాయని చెబుతున్నారు



ఏప్రిల్, మే నెలలో చేసిన పనులకు ఇప్పటివరకు డబ్బులు రాలేదు. పంచాయతీ కార్యదర్శిని పలుమార్లు అడిగితే వస్తాయని చెబుతున్నారు. మండుటెండలను లెక్క చేయక ఉపాధిహామీ పనులకు పోయాం. దూరం ఎంతైన నడిచే వెళ్లాం. పనులు చేసి నెలల తరబడి పైసల కోసం ఎదురు చూస్తున్నాం.

– మల్యాల విజయ, కూలీ పెగడపల్లి

రెండు నెలల బిల్లు రావాలి



రెండు నెలల కూలీ డబ్బులు రావాలి. పనులు చేసినా సకాలంలో వేతనాలు సరైన సమయంలో చెల్లించడం లేదు. ఎండకాలంలో ఉపాధి పనులకు వెళ్లాం. కానీ ఇప్పటి వరకు ఆ పనులకు సంబంధించిన వేతనాలు రాలేదు. పెండింగ్‌లో ఉన్న కూలీ డబ్బులు చెల్లించాలి. లేకుంటే మాకు పస్తులే.

– సాతి మల్లయ్య, పెగడపల్లి

నిధులు రాగానే ఖాతాల్లో జమ



ఉపాధి పనులు చేసిన ప్రతి కూలికి డబ్బులు వస్తాయి. పనుల్లో పాల్గొన్న ప్రతి కూలీ వివరాలు ఆన్‌లైన్ చేశాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. రాగానే నేరుగా ఖాతాల్లో జమ చేస్తారు.

– రఘువరన్ డీఆర్డీవో

క్లుప్తంగా

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య


రాజశేఖర్ మృతదేహం

కోరుట్లరూరల్: అనారోగ్యంతో బాధపడుతూ.. కోరుట్ల మండలం అయిలాపూర్‌కు చెందిన మైలారం గోపాల్ (53) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గోపాల్ యూసుఫ్‌నగర్ పంచాయతీలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవలే గుండెకు స్టంట్ వేశారు. మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి ఊరు శివారులో ఉరేసుకున్నాడు. అటువైపు వెళ్లిన వారు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చా రు. గోపాల్‌కు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య గౌతమి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు తాగి వలసజీవి..

ధర్మపురి: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన ఓ వలస జీవి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. ధర్మపురి మండలం తీగలధర్మారానికి చెందిన అలకుంట రాజశేఖర్‌కు ఎనిమిదేళ్ల క్రితం పట్టణానికి చెందిన జ్యోతితో వివాహమైంది. వారికి ఓ కుమారుడు సంతానం. రాజశేఖర్ కొన్నాళ్లుగా దుబాయి వెళ్లి వస్తున్నాడు. జ్యోతి పుట్టింటి వద్ద ఉంటోంది. స్వగ్రామంలోనే కలిసి ఉందామని, త్వరగా ఇంటికి రావాలని జ్యోతి రాజశేఖర్‌ను పలుమార్లు ఫోన్‌లో కోరుతోంది. ఈ క్రమంలో సుమారు రెండు నెలల క్రితం రాజశేఖర్ స్వగ్రామానికి వచ్చాడు. నెల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ చోటుచేసుకోగా.. జ్యోతి పుట్టింటికి వెళ్లింది. కాపురానికి రావాలని రాజశేఖర్ పలుమార్లు కోరినా ఆమె నిరాకరించింది. మనస్తాపానికి గురైన రాజశేఖర్ మంగళవారం పురుగుల మందు తాగాడు. బంధువులు జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడి తల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇల్లు కట్టలేదని భార్య..

జూలపల్లి(పెద్దపల్లి): ఇల్లు కట్టలేదనే మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించిన మెండె రజిత(35) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఎస్సై సనత్‌కుమార్ కథనం ప్రకారం.. జూలపల్లికి చెందిన మెండె రజిత – చిన్న రాజయ్య భార్యాభర్తలు. తాము నివాసం ఉండే ఇల్లు పాతది కావడంతో కొత్తది నిర్మించాలని కొంతకాలంగా రజిత తన భర్తను కోరుతూ వస్తోంది. ఆయన ఎంతకూ ఆమె మాట వినలేదు. కొత్త ఇల్లు కట్టలేదు. మనస్తాపం చెందిన ఆమె.. జూన్ 26న గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రుద్రంగి గుట్టల్లో మృతదేహం?

రుద్రంగి(వేములవాడ): హాస్టల్ వెనుక మామిడితోట పక్కన గల అడవిలో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. మృతదేహం కోసం పోలీసులు గుట్టల్లో గాలిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై రుద్రంగి ఎస్సై శ్రీనివాస్‌ను వివరణ కోరగా గొర్లకాపరులు చూసి గ్రామస్తులకు చెప్పడంతో ఈ చర్చ మొదలైనట్లు తెలిపారు. అనుమానిత స్థలంలో గాలించినట్లు పేర్కొన్నారు. మృతదేహం దొరకలేదని, గురువారం సైతం గాలిస్తామని చెప్పారు.



ఇది జిల్లా కేంద్రంలోని కొత్తచెరువు మత్తడికాల్వ. ఇది పూర్తిగా కబ్జాకు గురైంది. కాలువ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే మానేరునదిలో కలిసే మత్తడినీటి కాల్వ ఇప్పుడు ఆనవాళ్లు కోల్పోయింది. గతంలో ఇక్కడ కాల్వ ఉండనదానికి ఇక్కడ సుమారు రూ.50లక్షల వ్యయంతో మత్తడికాల్వపై కల్వర్టును నిర్మించడమే నిదర్శనం. ఇక్కడి స్థలాలు కోట్ల విలువ పలకడంతో ప్రజాప్రతినిధులు, రియల్టర్లు కలిసి కాలువ భూమిని కబ్జా చేసినట్లు స్థానికులు చెబుతున్నారు.



మీరు చూస్తున్నది రాయినిచెరువు పురాతన మత్తడికాలువ. ఇప్పుడు చెరువు లేదు. సర్కారు పట్టాలు చేసి కార్మికులకు అందించగా..లోతట్టు ప్రాంతం కాబట్టి వరదనీరు పోవడానికి కాలువను అలాగే ఉంచగా కబ్జాకు గురైంది. ఇది చెరువు నుంచి గోపాల్‌నగర్ మీదుగా రెండు కిలోమీటర్ల దూరం వరకు ప్రవహించి మానేరువాగులో కలిసేది. కాల్వ ఆనవాళ్లు పూర్తిగా లేకుండా చేసి ఇక్కడ నిర్మాణాలు జరిగాయి. సంబంధిత శాఖల అధికారులకు తెలిసీ కూడా కాల్వ స్థలాన్ని ఆధీనంలోకి తీసుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వరదకు దారేది?

- కబ్జా కోరల్లో మత్తడి కాల్వలు
- నిర్జీవమైపోతున్న సిరిసిల్ల చెరువులు
- జలవనరులనూ వదలని కబ్జాదారులు
- పరాధీనంలో రూ.కోట్లు విలువైన ఆస్తులు
- పట్టింపులేని మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు



చిన్నపాటి వర్షానికి జలమయమైన సంజీవయ్యనగర్ ప్రాంతం

సిరిసిల్లటౌన్: కబ్జాకు కాదేదీ అనర్హం అంటున్నారు అక్రమార్కులు. అధికారుల పట్టింపులేమి తనం అక్రమార్కులకు కలసొస్తుంది. సిరిసిల్లలో నిబంధనలను అతిక్రమించి మత్తడికాల్వలు కబ్జాకు గురయ్యాయి. పట్టణ నడిబొడ్డున పారే చెరువుల మత్తడి(వ్యవసాయ) కాలువలు ఇప్పుడూ పరాధీనమయ్యాయి. సంబంధిత శాఖలు అటువైపు చూడకపోవడంతో చెరువులు జీవం కోల్పోయే పరిస్థితి తలెత్తింది. కార్మిక క్షేత్రం సిరిసిల్లలో ఏళ్ల తరబడిగా చెరువుల కాల్వలు(నాలాలు) దురాక్రమణ పాలైన తీరుపై సాక్షి ప్రత్యేక కథనం.

సిరిసిల్ల చుట్టూ గొలుసు చెరువులు

పూర్వీకులు వ్యవసాయం, తాగునీటి అవసరాల కోసం సిరిసిల్ల చుట్టూ తొమ్మిది చెరువులు గొలుసుకట్టు పద్ధతిలో నిర్మించారు. వర్షాలతో ఒక చెరువు నిండాక దాని కింద చెరువుకు నీరుపోయేలా తవ్వించినట్లు చరిత్రకారులు చెబుతుంటారు. ఇందులో రాయినిచెరువు, తుమ్మలకుంటలను నివాస స్థలాలుగా అభివృద్ధి చేయగా వాటి ఆనవాళ్లు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం పట్టణానికి ఇరువైపులా ఉన్న కొత్తచెరువు, కార్గిల్‌లేక్ చెరువులు పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. ఇవి నీటిపారుదల, మున్సిపల్‌శాఖల ఆధీనంలో ఉన్నాయి. అర్జున్‌కుంట, ఈదులచెరువు, దేవునికుంట, మైసమ్మకుంట, దామెరకుంట రెవెన్యూశాఖ ఆధీనంలో ఉన్నాయి. కొత్తచెరువు, కార్గిల్‌లేక్ స్థలాలు, మత్తడి కాల్వలు కబ్జాకు గురైనట్లు ఇరిగేషన్ అధికారులే చెబుతున్నారు. కానీ చర్యలు తీసుకోవడంలో కినుక వహించడం విమర్శలకు తావిస్తోంది.

నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

ఒకప్పుడు ఊరి శివారులో ఉండే రాయినిచెరువు, తుమ్మలకుంట స్థలాల్లో పట్టణం విస్తరించింది. అవి లోతట్టు ప్రాంతాలు కావడంతో సాధారణ వర్షాలకే వరద పోటెత్తుతోంది. పై నుంచి వచ్చే వరదనీరు ఆయా ప్రాంతాల్లో నిలువకుండా వరదకాల్వలు లేకపోవడంతో వర్షాకాలంలో ముంపుకు గురువుతున్నాయి. ఇక చెరువుకట్టలను ఆనుకుని ఎలాంటి నిర్మాణాలు ఉండకూడదన్న నిబంధనలకు భిన్నంగా పరిస్థితి ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈదులచెరువు, అర్జునకుంట, దేవునికుంట, మైసమ్మకుంట, దామరకుంటలను రక్షించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొత్తచెరువు, కార్గిల్‌లేక్‌ల కాలువలు, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ లెవల్ స్థలాలు కబ్జాకు గురవడంపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల చెరువులు, కాల్వలకు 30 ఫీట్ల దూరంలోపే నిర్మాణాలు జరుగుతున్నాయని వాటికి అనుమతులు ఎలా ఇస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కోట్లాది రూపాయల ఆస్తులు అన్యాక్రాంతం

కార్గిల్‌లేక్, రాయినిచెరువు, తుమ్మలకుంట, కొత్తచెరువుల మత్తడికాల్వలు అన్యాక్రాంతమయ్యాయి. వీటి విలువ వందల కోట్లలోనే ఉంటుందని రియల్ ఎస్టేట్ వర్గాల అంచనా. ఒక్కో కాలువ 33 మీటర్ల వెడల్పుతో కిలోమీటర్ల పొడవుగా ఉండే వాటి విస్తీర్ణం వందల ఎకరాలు ఉంటుందని చెబుతున్నారు. ప్రస్తుతం పట్టణంలో సగటున గజానికి రూ.30వేలకు తక్కువ లేదు. అందుకే అక్రమార్కులు అధికారులను మచ్చిక చేసుకుని తతంగం నడిపినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువులు, కాల్వల నుంచి గొలుసుకట్టు దూరంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదన్న నిబంధనలను కూడా అధికారులు అమలు చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

సిరిసిల్లలో చెరువుల వివరాలు

చెరువు	సర్వేనంబర్	విస్తీర్ణం (ఎకరాల్లో)	కాలువ (కి.మీ)
కొత్తచెరువు	1471	85.05	4
రాయినిచెరువు	703	152.10	3
ఈదులచెరువు	991	77.29	1.5
అర్జునకుంట	757	22.36	1
దేవునికుంట	1121	9.28	1.5
మైసమ్మకుంట	1294	11.02	1
దామరకుంట	232, 233	7.38	2
తుమ్మలకుంట	142, 143	29.23	2
వర్ధనికుంట	–	–	–

కాల్వను సరిగ్గా నిర్మించలేదు



వెంకంపేట, పద్మనగర్ ప్రాంతాలు లోతట్టుగా ఉంటాయి. వర్షాలు పడితే బోనాల తదితర చెరువుల నుంచి మత్తడి కాల్వలు సిరిసిల్లకు ప్రవహిస్తాయి. పైనుంచి వచ్చే వరదనీరు వెళ్లేందుకు బస్టాండు ప్రాంతంలో కాల్వ నిర్మించినా లాభం లేదు. పెద్దవర్షం పడితే చాలు నాలాలు నిండి నీరంతా షాపుల్లోకి, రోడ్డు పైకి వస్తుంది. ఏళ్లనంది సమస్యను ఇప్పుడైనా పరిష్కరించాలి.

– చిక్కుడు శ్రీనివాస్, వెంకంపేట

దేహదానానికి ముందుకొచ్చిన ప్రిన్సిపాల్ కుటుంబం

- మెడికల్ కాలేజీకి ఇచ్చేందుకు అంగీకారం


ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న కనకశ్రీ విజయ రఘునందన్

సిరిసిల్లకల్చరల్: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయరఘునందన్ కుటుంబం దేహదానానికి అంగీకరించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి తమ దేహాలను ఇచ్చేందుకు అంగీకరిస్తూ అర్జీ పెట్టుకున్నారు. అభ్యర్థనను అంగీకరిస్తూ కళాశాల ప్రిన్సిపాల్ బుధవారం సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ రఘునందన్ తోపాటు అతని సతీమణి, తండ్రిని సైతం దేహదానానికి ఒప్పించారు. జిల్లాలో దేహదానానికి ముందుకొచ్చిన మొదటి వ్యక్తి ప్రిన్సిపాల్ విజయ రఘునందన్. అతనితోపాటు తన కుటుంబంలోని మరో ఇద్దరిని ఒప్పించడం అభినందించాల్సిన విషయం.

యువకుల ప్రాణాలు కాపాడిన లోకో పైలెట్లు


స్కూటీతో ట్రాక్‌పైకి వస్తున్న యువకులు

ఫెర్టిలైజర్‌సిటీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ రైల్వేగేట్ వద్ద ఇద్దరు యువకులను లోకో పైలెట్లు కాపాడారు. మూసి ఉన్న రైలు గేట్ దాటేందుకు యువకులు ప్రయత్నం చేయగా.. స్కూటీ పట్టాల కంకరలో కూరుకుపోయింది. అప్పటికే సింగరేణి బొగ్గులోడ్‌తో గూడ్స్‌రైలు వేగంగా దూసుకు వస్తోంది. అయితే, ట్రాక్‌పై ఉన్న యువకులను గుర్తించిన లోకో పైలెట్ సీహెచ్ రవి, అసిస్టెంట్ లోకో పైలెట్ దీపక్ కుమార్ ఎమర్జెన్సీ బ్రేక్ వేసి రైలును ఆపారు. దీంతో గేట్ వద్ద ఉన్నవారు ఊపిరిపీల్చుకున్నారు. రైల్వే సిబ్బంది సాయంతో ద్విచక్ర వాహనాన్ని పక్కకు నెట్టేశారు. ప్రమాదం జరగకుండా చాకచక్యంగా వ్యవహరించిన లోకో పైలెట్లను స్థానికులు అభినందించారు.

అలరించిన పోలీస్ డ్యూటీ మీట్


సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జాగిలం


పరీక్షలు రాస్తున్న పోలీసులు


పోటీలకు సిద్ధమైన డాగ్‌స్క్వాడ్

గోదావరిఖని: కాళేశ్వరం జోన్‌స్థాయి తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్ బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో ప్రారంభమైంది. నైపుణ్యం, సామర్థ్యం, ప్రతిభ గుర్తించడానికి పోలీస్ డ్యూటీ మీట్ ఏర్పాటు చేశారు. రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాళేశ్వరంజోన్‌లోని రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి పెద్దపల్లి, మంచిర్యాల జోన్, కుమురంభీమ్ ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లా పరిధిలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు పోటీలు నిర్వహించారు. గురువారం కూడా పోటీలు జరుగుతాయి. కార్యక్రమంలో అదనపు డీసీపీ(అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్, గోదావరిఖని, ట్రాఫిక్, ఏఆర్ ఏసీపీలు మల్లారెడ్డి, రమేశ్, శ్రీనివాస్ ప్రతాప్, సీఐలు బాబురావు, సతీశ్, చంద్రశేఖర్‌గౌడ్, ఆర్‌ఐలు దామోదర్, వామనమూర్తి, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలలో కాసం ఫ్యాషన్స్ ప్రారంభం


కాసం ఫ్యాషన్స్ షోరూంను ప్రారంభిస్తున్న అనసూయ


నిర్వాహకులతో అనసూయ

- ఆటపాటలతో సందడి చేసిన అనసూయ

జగిత్యాల: జగిత్యాల పట్టణంలో కాసం ఫ్యాషన్స్ 18వ స్టోర్‌ను సినీ నటి, యాంకర్ అనసూయ ప్రారంభించారు. ఆధునాతన కలెక్షన్స్‌తో నిత్యం నూతన వెరైటీలతో కాసం పేరుగాంచిందని తెలిపారు. జగిత్యాలలో ఈ స్టోర్ ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందని, ఇది జగిత్యాల జిల్లా వాసులకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. నిర్వాహకులు మల్లికార్జున్, కేదరినాథ్, శివప్రసాద్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో నాలుగేళ్లుగా ప్రజల మన్ననలు పొందుతూ ఇప్పటివరకు 18 స్టోర్‌లను ప్రారంభించామన్నారు.

షాపింగ్‌మాల్ ఎదుట సందడి

యాంకర్ అనసూయ జగిత్యాలకు రావడంతో షాపింగ్‌మాల్‌వద్ద సందడి నెలకొంది. అభిమానులు, యువత పెద్ద ఎత్తున తరలిరావడంతో షాపింగ్ మాల్ వద్ద పండుగ వాతావరణం నెలకొంది.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు


నిందితుల అరెస్టు చూపిస్తున్న పోలీసులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బుధవారం తీగలగుట్టపల్లి రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కరీంనగర్ నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు యువకులు పోలీసులను చూసి వెనక్కి వెళ్లేందుకు ప్రయత్నించగా పట్టుకున్నారు. ఎస్ఐ లక్ష్మారెడ్డి విచారణ జరపగా.. కరీంనగర్‌కు చెందిన మర్రి దీక్షిత్, సిద్ధార్థ, శశిధర్‌గా గుర్తించారు. ఎస్ఐ ద్విచక్ర వాహనాన్ని పరిశీలించగా.. గంజాయి ప్యాకెట్లు లభించాయి. రూరల్ స్టేషన్‌కు ముగ్గురు యువకులను తరలించి విచారణ చేపట్టారు. మర్రి దీక్షిత్ కొంతకాలంగా ఆంధ్రా నుంచి గంజాయి అక్రమంగా తెప్పిస్తూ ఇతరులకు అమ్ముకుంటూ లాభాలు గడిస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురు యువకుల నుంచి ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్లు, గంజాయిని స్వాధీనం చేసుకొని కోర్టుకు తరలించినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఆరునెలల వ్యవధిలో అన్నదమ్ములు మృతి

- తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- కాల్వశ్రీరాంపూర్‌లో విషాదం


రాజు(ఫైల్)


శ్రీనివాస్(ఫైల్)

కాల్వ శ్రీరాంపూర్(పెద్దపల్లి): ఇద్దరు అన్నదమ్ములు ఏడాది వ్యవధిలోనే వేర్వేరు కారణాలతో మృతి చెందడం ఆ కుటుంబంలో తీరని విషాదం నింపింది. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన తూండ్ల రాజు(35) బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడి సోదరుడు శ్రీనివాస్ ఆర్థిక ఇబ్బందులతో పది నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడాది వ్యవధిలోనే ఇద్దరు కుమారులు వేర్వేరు కారణాలతో మృతిచెందడంతో తల్లిదండ్రులు దేవమ్మ –మధునయ్య కన్నీటి పర్యంతమయ్యారు. దినసరి కూలీలుగా పనిచేసే తల్లిదండ్రులు.. వచ్చే ఆదాయంతోనే ఇద్దరు కుమారులను పెంచి పోషించి ప్రయోజకులను చేశారు. మలిదశలో తమ బాగోగు చూస్తారనుకుంటే అర్ధంతరంగా తనువు చాలించడం తల్లిదండ్రులకు శోకం మిగిల్చినట్లయ్యింది. కాగా, రాజుకు భార్య రేవతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన రాజు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం


గణేశ్ (ఫైల్)


రాజ్‌కుమార్ (ఫైల్)

కొడిమ్యాల/మల్యాల: వారిద్దరూ స్నేహితులు. ఒకరు ముంబయిలో ఉంటూ వంట పనులకు వెళ్తున్నాడు. మరొకరు స్థానికంగా ఉంటూ తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు. ముంబయి నుంచి స్నేహితుడు రావడంతో ఇద్దరూ కలిసి బైక్‌పై వేములవాడ వెళ్లేందుకు బయల్దేరారు. ఇంతలోనే వారిని విధి వెక్కిరించింది. బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొని ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ సంఘటన కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామ శివారులో చోటుచేసుకుంది. మృతులిద్దరిది మల్యాల మండలకేంద్రం. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మల్యాల మండల కేంద్రానికి చెందిన జడ సోమయ్య, లత దంపతుల కుమారుడు గణేశ్.. దయాల మల్లేశం కుమారుడు రాజ్‌కుమార్ స్నేహితులు. గణేశ్ తండ్రి సోమయ్య ఇరవై ఏళ్ల క్రితమే చనిపోయాడు. అప్పటి నుంచి లత గణేశ్‌ను పోషిస్తుండగా ఆయన ఆమెకు వ్యవసాయ పనుల్లో చేదోడువాదోడుగా ఉంటున్నాడు. రాజ్‌కుమార్ తల్లి గతంలోనే చనిపోయింది. మల్లేశం వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. రాజ్‌కుమార్ కొన్నాళ్లుగా ముంబయిలో ఉంటూ అక్కడే వంట పనులకు వెళ్తున్నాడు. ఓ కేసు నిమిత్తం రాజ్‌కుమార్ రెండు రోజుల క్రితం మల్యాలకు వచ్చాడు. స్నేహితుడైన గణేశ్‌తో సరదాగా గడిపారు. గణేశ్ మంగళవారం పులి వేషంవేసి వేశాడు. బుధవారం ఇద్దరూ కలిసి వేములవాడకు బయల్దేరారు. ఈ క్రమంలో కొడిమ్యాల మండలం నల్లగొండ శివారుకు చేరుకోగానే వారు ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొంది. ఈ ఘటనలో దయ్యాల రాజ్ కుమార్ (25), జడ గణేశ్ (24) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్థానికుల సమాచారం మేరకు కొడిమ్యాల పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. కుటుంబసభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకుని గుండెలవిసేలా రోదించారు. స్నేహితులిద్దరూ ఒకేసారి ప్రాణాలు విడవడంతో మల్యాలలో విషాదం చోటుచేసుకుంది. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కొడిమ్యాల పోలీసులు తెలిపారు.

యువకుడు అదృశ్యం

కరీంనగర్‌క్రైం: నగరంలోని హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన ఒక యువకుడు అదృశ్యమైనట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన మర్రిబోయిన అనిల్(25) గత నెల 26న బయటకు వెళ్లివస్తానని చెప్పి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన వాళ్లు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


కోరుట్లరూరల్: పట్టణ శివారు అయోధ్యపట్నం ప్రాంతానికి చెందిన కొరిమె లక్ష్మణ్ (57) గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మణ్ తన భార్య రాజవ్వ జాతీయ రహదారి పక్కన స్వీట్‌కార్న్ విక్రయిస్తుంటారు. మంగళవారం రాత్రి ఇంటికి వస్తుండగా జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం లక్ష్మణ్‌ను ఢీకొట్టి వెళ్లింది. ఈ ఘటనలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. లక్ష్మణ్‌కు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. భార్య రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పట్టపగలు ఇంట్లో చోరీ


చిందరవందరగా పడిఉన్న వస్తువులు

జమ్మికుంటరూరల్: జమ్మికుంట మండలం సైదాబాద్ గ్రామంలో పట్టపగలే చోరీ జరిగింది. టౌన్ సీఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. సైదాబాద్ గ్రామానికి చెందిన వేముల సత్యనారాయణ బుధవారం జమ్మికుంట వెళ్లాడు. అతని భార్య సుజాత ఇంటికి తాళం వేసి వనభోజనాలకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి రాగా.. ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా.. వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని రెండు తులాల బంగారం, 12తులాల వెండి, రూ.26వేల నగదు అపహరణకు గురయ్యాయి. టౌన్ సీఐ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం


రవీందర్ అంత్యక్రియల్లో కుటుంబసభ్యులు, బంధువులు

జగిత్యాలక్రైం: జగిత్యాలకు చెందిన రేవెళ్ల రవీందర్ (57) ఇటీవల గుండెపోటుతో ఇజ్రాయిల్‌లో మృతిచెందిన విషయం తెల్సిందే. ఆయన మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరుకుంది. కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. అంత్యక్రియల్లో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

రైల్వే సేవలన్నీ ఒకేయాప్‌లో..

- ఒకటి నుంచి అమలులోకి వచ్చిన రైల్‌వన్ యాప్



'రైల్ వన్' యాప్ లోగో

రామగుండం: భారతీయ రైల్వే ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలను అందించేందుకు ఒకే యాప్‌ను డిజైన్ చేసిన రైల్వే.. ఈనెల ఒకటో తేదీన అమలులోకి తీసుకొచ్చింది. సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సీఆర్ఐఎస్) పేరిట తీసుకొచ్చిన ఈయాప్ ద్వారా అన్ని సేవలను అత్యంత వేగంతో యాక్సెస్ చేసే వీలుంటుంది.

ప్రయాణికులకు అందే సేవలు..

- టికెట్ బుకింగ్, రిజర్వ్‌డ్, అన్ రిజర్వుడ్, ప్లాట్‌ఫాం టికెట్ల బుకింగ్
- ప్లాన్ మై జర్నీ టూల్ ద్వారా వివిధ తరగతులు, కోటాలో టికెట్ల బుకింగ్
- అన్ రిజర్వుడ్, ప్లాట్‌ఫాం టికెట్లపై 3శాతం డిస్కౌంట్

రైలు స్థితి తెలుసుకోవడం...

- రైలు స్థితి, ప్లాట్‌ఫారం నంబర్, ఆలస్యం తదితర వివరాలు
- కోచ్ పొజిషన్

పీఎన్ఆర్ స్టేటస్ రిఫండ్.

- ముందస్తు రిజర్వేషన్ టికెట్ ప్రస్తుత స్థితిగతులు.. టికెట్ పీఎన్ఆర్ నంబర్ ద్వారా సీటు కన్ఫర్మేషన్ స్టేటస్.. రైళ్ల రద్దు, రిజర్వేషన్ రద్దు తదితర సేవలు

ఫుడ్ ఆర్డరింగ్..

- ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) యాప్ ద్వారా వివిధ రైల్వేస్టేషన్లకు చేరుకునేందుకు ముందు నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేసుకోవడం.. రైల్వేస్టేషన్‌కు రైలు చేరుకున్నాక సీటు వద్దకే ఫుడ్ చేర్చడం

యాప్‌ను ఇలా డౌన్‌లోడ్ చేసుకోవాలి..

- అండ్రాయిడ్ ఫోన్లలోనే గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వీలుంది.

https://play.google.com/store/apps/details?=org.cris.aikyam
IOS యాపిల్ యాప్ స్టోర్ నుంచి అయితే..
https://apps.apple.com/in/app/railone/id6473384334

ఉపయోగించే విధానం..

- యాప్‌ను డౌన్‌లోడ్ చేశాక రైల్‌కనెక్ట్ లేదా యూటీఎస్ యాప్ లాగిన్ వివరాలతో లాగిన్ కావాలి
- కొత్త వినియోగదారులు మొబైల్ నంబర్, ఓటీపీ ద్వారా రిజిష్టర్ చేసుకోవాలి
- mPIN లేదా బయోమెట్రిక్ ద్వారా సులభంగా లాగిన్ చేయవచ్చు.
- 'ప్లాన్ మై జర్నీ' లేదా 'మై బుకింగ్స్' వంటి ఆప్షన్లను ఉపయోగించి సేవలను యాక్సెస్ చేయవచ్చు.

ఇవీ ప్రయోజనాలు..

- ఒకేయాప్‌లో ఐఆర్‌సీటీసీ రైల్ కనెక్ట్, యూటీఎస్, రైల్‌మదద్, ఎన్‌టీఈఎస్, ఫుడ్ ఆన్ ట్రాక్ వంటి సేవలు
- బహుళ యాప్‌ల అవసరం తగ్గించి, డివైస్ స్టోరేజీలు ఆదా చేసుకోవచ్చు
- సరళమైన ఇంటర్‌ఫేస్, సింగిల్ సైన్–ఆన్ ద్వారా ఉపయోగం సులభతరం
- డిసెంబర్ 2025 నాటికి కొత్త పీఆర్ఎస్ సిస్టమ్ ద్వారా నిమిషానికి 1.5 లక్షల టికెట్ బుకింగ్స్, 40 లక్షల ఎంక్వైరీలను నిర్వహించగల సామర్థ్యం.